## క్లుప్తంగా

### రేపు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ

**సత్తెనపల్లి:** పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న తారకరామ సాగర్ మెయిన్ గేట్ ఎదురుగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని గురువారం విగ్రహావిష్కరించనున్నట్లు స్వామి వివేకానంద చైతన్య భారతి బాధ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి 127వ జయంతి సందర్భంగా చైతన్య భారతి ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు, ప్రారంభకులుగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, విశిష్ట అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి పాల్గొంటారని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని తెలిపారు.

### 6 నుంచి వారాహీదేవి నవరాత్రులు

**సత్తెనపల్లి:** పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గా పీఠంలో వేంచేసిన శ్రీ దుర్గా మాతని వారాహీదేవిగా అలంకరించి ఈ నెల 6 నుంచి 15 వరకు నవరాత్రులు జరుపుతున్నామని పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ వారాహీ మాతకి లలితా సహస్ర నామ స్తోత్రం, వారాహీ అష్టోత్తర శతనామాలు, అమ్మవారి ద్వాదశ నామాలు, మూల మంత్రం, గాయత్రి మంత్రంతో కుంకుమార్చన ఉంటాయని తెలిపారు. ప్రత్యేక నైవేద్యాలు, మంత్ర పుష్పం, హారతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది రోజులు పాల్గొనే భక్తులకు శ్రీచక్ర మేరువ (ఒక్కొక్కరికి ఒక్కోటి )ఇచ్చి కుంకుమ పూజలు జరిపిస్తామని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

### పింఛన్ పంపిణీలో ప్రజా ప్రతినిధులను విస్మరించారు

**అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో భాగంగా స్థానిక ప్రజా ప్రతినిధులను విస్మరించటం దారుణమని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఆహ్వానం లేకుండా పింఛను పంపిణీ చేయడం వారిని అవమాన పరచడమేనని పేర్కొన్నారు. అధికారులు కూడా ఏకపక్షంగా వ్యవహరించి, ప్రజాప్రతినిధులను అహ్వానించకపోవడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


### జ్వర సర్వే చేపట్టాలి

**రాజుపాలెం:** ఆశ కార్యకర్తలు జ్వర సర్వే చేపట్టి బాధితులను గుర్తించాలని డాక్టర్ కృష్ణకుమార్ ఆదేశించారు. వారిని వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి రక్త పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ మేరకు సీజనల్ వ్యాధుల నివారణకు మంగళవారం ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలింతలు, గర్భిణుల పట్ల నిత్యం శ్రద్ధ వహించి, పరీక్షలు చేయించాలని స్పష్టం చేశారు. రెండు మూడు రోజులు వరుసగా జ్వరం వచ్చినట్లయితే.. వారిని ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

### చికిత్స పొందుతూ వివాహిత మృతి

**నకరికల్లు:** భర్త వేధింపులు తాళలేక మనస్థాపానికి గురైన వివాహిత ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు మంగళవారం వెల్లడించారు. నకరికల్లుకు చెందిన కొత్తపల్లి గ్లోరీ (33)ని భర్త పీరయ్య గత కొన్నిరోజులుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. మద్యానికి బానిసై, కుటుంబ పోషణ పట్టించుకోకుండా మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేయడంతో.. మనస్థాపానికి గురైన గ్లోరీ జూన్ 26న ఎలుకల మందు పేస్ట్ తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఘటనపై ఎస్ఐ కె.నాగేంద్రరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా కుమారస్వామి



**పిడుగురాళ్ల:** పిడుగురాళ్ల పట్టణ బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం సాయంత్రం జరిగాయి. అధ్యక్షునిగా కె.కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024–25 ఏడాదికి సంబంధించి పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు కౌన్సిల్ సభ్యులు తెలిపారు. ఉపాధ్యక్షురాలుగా పి.భవాని, సెక్రటరీగా కె.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా పి.మాణిక్యం, ట్రెజరర్‌గా ఎం.లోకేశ్వరి, లైబ్రేరియన్‌గా ఎస్‌వీ కోటేశ్వరరావు, లేడీస్ రిప్రజెంటేటివ్‌గా పి.నవ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను ప్రముఖ క్రిమినల్ లాయర్ సీనియర్ న్యాయవాది దారా చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని పిడుగురాళ్ల సీనియర్ న్యాయవాదులు రెడ్డి సాంబశివరావు, కె.కాశీ విశ్వనాథం, యు.కోటేశ్వరరావు, పి.మరియన్న, ఎం.రూత్ బనియన్, కె.జాలారావులు అభినందించారు.

# దార్శనిక దారుల్లో విద్యా వికాసాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ పాఠాలు
- తొలివిడతగా సత్తెనపల్లి నియోజకవర్గంలో 11 పాఠశాలల ఎంపిక
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు చర్యలు
- జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం

నాణ్యమైన విద్యతోనే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశ్వసించింది. విద్యా రంగానికి పెద్దపీట వేసి, ప్రభుత్వ బడుల్లో నూతన సంస్కరణలకు సీఎంగా వైఎస్ జగన్ నాంది పలికారు. నాడు–నేడు కింద పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించి, డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. అలాగే ప్రభుత్వ బడుల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేసేందుకు ఆయన చేపట్టిన చర్యలు ఇప్పుడు ఫలితాలిస్తున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి కేంద్రం సీబీఎస్ఈ విద్యా విధానాన్ని అమలు చేయనుంది.



సీబీఎస్ఈ బోధనకు ఎంపికైన బృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

**సత్తెనపల్లి:** ఎంపిక చేసిన పాఠశాలల్లో సీబీఎస్ఈ( సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్)బోధనను ప్రవేశ పెట్టింది ప్రభుత్వం. పిల్లలు చదువులో అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో అడుగులు వేసింది. ప్రభుత్వ బడుల్లో బట్టీ విధానానికి స్వస్తి పలికి, మూస పద్ధతిని వీడేందుకు... తొలి విడతలో జిల్లాలోని 67 పాఠశాలలను ఎంపిక చేయగా.. అందులో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఒక పట్టణం , నాలుగు మండలాల్లో 11 పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు.

**పేద విద్యార్థులకు ప్రోత్సాహం**

కేంద్రియ విద్యాలయం, జవహర్ నవోదయ, ప్రైవేట్ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానం అమలవుతోంది. జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే కేంద్ర విద్యా విధానం ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో రాష్ట్ర పాఠశాలల్లో విద్యార్థులకు ఇలాంటి బోధన అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అన్ని రకాల వనరులు ఉండి, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేసుకుని, ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తోంది. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు సీబీఎస్ఈ బోధనను విద్యార్థులు అందుకోనున్నారు. దీంతో ఆయా విద్యాలయాల పర్యవేక్షణ కేంద్రం పరిధిలోకి వెళ్తుంది. ఇది జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగం. విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు పెంచేలా సిలబస్ ఉంటుంది. వారికి ఆసక్తి, అభిరుచి గుర్తించి వివిధ రంగాల్లో ప్రోత్సహిస్తారు. అవసరం మేరకు ఉపాధ్యాయులను నియమిస్తారు.

**సత్తెనపల్లిలో సీబీఎస్ఈకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలు**

| మండలం | పాఠశాల |
|---|---|
| సత్తెనపల్లి టౌన్ | కస్తుర్బాగాంధీ విద్యాలయం(కేజీబీవీ) |
| సత్తెనపల్లి టౌన్ | జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(సుగాలీ) |
| సత్తెనపల్లి రూరల్ | జెడ్పీహెచ్ఎస్, బృగుబండ |
| సత్తెనపల్లిరూరల్ | జెడ్పీహెచ్ఎస్, కొమెరపూడి |
| సత్తెనపల్లి రూరల్ | ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్, బాలికలు |
| ముప్పాళ్ళ | కేజీబీవీ |
| రాజుపాలెం | కేజీబీవీ |
| రాజుపాలెం | జెడ్పీహెచ్ఎస్,గణపవరం |
| నకరికల్లు | కేజీబీవీ |
| నకరికల్లు | జెడ్పీహెచ్ఎస్, గుండ్లపల్లి |
| నకరికల్లు | ఏపీ మోడల్ స్కూల్, దేచవరం |

**సీబీఎస్ఈ ప్రయోజనాలు**

సీబీఎస్ఈ సిలబస్ విద్యార్థులకు అర్థమయ్యేలా రీతిలో ఉంటుంది. కోర్సుల నిర్మాణం ఒత్తిడికి గురి చేయదు. విద్యార్థికి స్నేహ పూర్వకంగా ఉంటుంది. పోటీ పరీక్షల్లో విద్యార్థులకు విజయం సాధించేందుకు దోహదపడుతుంది. యాంత్రిక విద్యకు దూరంగా ఉంటూ.. వాస్తవాలకు దగ్గరగా బోధిస్తారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెద్దగా ప్రాధాన్యం కల్పించరు. సబ్జెక్టుల వారీగా ఏ మేరకు నేర్చుకున్నారన్నది పరీక్షించేలా ప్రశ్న పత్రాలు రూపొందిస్తారు. ఐఐటీ వంటి కేంద్రీకృత సంస్థ నుంచి భవిష్యత్ అధ్యయనాలు కొనసాగించుకోవాలంటే సీబీఎస్ఈ పాఠ్యాంశాలు సహాయపడతాయి. ఈ సంస్థల ప్రాథమిక పరీక్షలు సీబీఎస్ఈ ఆధ్వర్యంలో మాత్రమే నిర్వహిస్తారు.

**కార్పొరేట్ స్థాయిలో అభ్యాసన**



తొలి విడతలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ద్వారా పాఠాల బోధన ఉంటుంది. కార్పొరేట్ స్థాయిలో అభ్యాసన ఉంటుంది. ఇది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుంది. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఈ విద్య ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ వరం. ఈ ఏడాది నుంచే అమలు చేయనున్నారు.

–ఎ.శ్రీనివాసరావు, ఎంఈఓ, సత్తెనపల్లి.

## సేంద్రియ ఎరువులతో భూసారాన్ని పెంచుకోవచ్చు

ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి


**రెంటచింతల:** సేంద్రియ ఎరువులైన పచ్చిరొట్ట పంటలు పిల్లిపెసర, జీలుగ, జనుము పంటలను వేసి భూమిలో కలియదున్ని రైతులు భూసారాన్ని పెంచుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పలు రకాల పంటలను సాగు చేసే సమయంలో జీవన ఎరువుల వాడకం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని అవగాహన కల్పించాలన్నారు. సాగు చేస్తున్న పంటలకు జీవన ఎరువుల వినియోగం వలన 20 శాతం వరకు ఖర్చు తగ్గుతుందని రైతులకు వివరించాలని సూచించారు. రసాయన ఎరువులను అధికంగా వాడకం వలన భూమిలో ఉన్న సేంద్రియ కర్బనం తగ్గుతుందని, దీంతో పంట పొలంలో భూ సాంద్రత గణనీయంగా తగ్గి పంటల దిగుబడి తగ్గిపోతుందని రైతులకు వివరించాలన్నారు. సాగు భూమిలో సూక్ష్మ పోషకాలైన మెగ్నీషియం, జింక్, ఇనుము, కాల్షియం లోపాలు ఉన్నా వాటిని పరిష్కరించుకోవడానికి మెగ్నీషియం సల్ఫేట్, జింక్ సల్ఫేట్ మూడు, నాలుగు సార్లు పిచికారీ చేసుకోవాలని తెలపాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనలతో పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించాలన్నారు. వివిధ రకాల తెగుళ్లు, పురుగుల బారి నుంచి తట్టుకునే వంగడాలు, పంట మార్పిడి, యాజమాన్య పద్ధతులను అమలు చేసినప్పుడే అధిక దిగుబడులను సాధించవచ్చని రైతులలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



**నరసరావుపేట ఈస్ట్:** కోటప్పకొండరోడ్డు శ్రీ నివాసనగర్‌లోని శ్రీగోదా పద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉదయం స్వామి, అమ్మవార్ల మూలవిరాట్ లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ఆరాధన, పుష్పయాగం తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## ఉచిత పశువైద్య శిబిరం



**రొంపిచర్ల:** మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో సంగం డైరీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఉమామహేశ్వరరావు, ఆంజనేయులు సేవలు అందించారు. వంద గేదెలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. లేగదూడల నట్టల నివారణకు మందులు వేశారు. పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు పానుగోటి శివానందం, పానుగోటి వెంకటేశ్వర్లు, గరికపాటి తాతయ్య, పాపారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలపై దృష్టి పెట్టాలి

ఎంపీపీ సంపూర్ణమ్మ

**రెంటచింతల:** గ్రామాలలో ప్రజల అవసరాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ పి.సంపూర్ణమ్మ అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలిసి సమష్టిగా కృషి చేసినప్పుడే గ్రామాలలో సమస్యలు పరిష్కరించడంతో పాటు ఆయా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అధికారులు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎంపీడీవో శంకర్‌రావు మాట్లాడుతూ రెంటచింతల గ్రామంలో సైడ్ కాల్వల్లో నున్న మంచి నీటి పైపులైన్లు వెంటనే కాల్వ పైభాగంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం కలుషిత నీరు తాగడం వలన వివిధ ప్రాంతాలలో డయేరియా కేసులు అధికంగా వస్తున్నాయన్నారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని..



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఏవో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా ఇప్పటి వరకు 190 క్వింటాళ్ల జీలుగలను రైతులకు పంపిణీ చేశామన్నారు. కొద్ది రోజులలో 25 క్వింటాళ్ల కందులు కూడా వస్తున్నట్లు రాయితీపై 1 కేజీ రూ.98కే రైతులకు అందజేయనున్నట్లు కావాల్సిన రైతులు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఎంపీటీసీలు, ఏపీవో జయచంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అతిసారతో చిన్నారుల ప్రాణాలకు ముప్పు

**శావల్యాపురం :** ఐదేళ్లలోపు చిన్నారుల్లో డయేరియా (అతిసార వ్యాధి) ప్రమాదకరమని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు కలుషితం అయితే ఈ వ్యాధి ప్రబలుతుందన్నారు. మరీ ముఖ్యంగా చిన్నారుల ప్రాణాలకు ఈ వ్యాధి ముప్పు అని తెలిపారు. సకాలంలో వైద్యసేవలు అందకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో డయేరియా బాధితుల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మందుబిళ్లలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. చిన్నారుల విషయంలో పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యవేక్షణలో కరపత్రాల పంపిణీతో పాటు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం పెంపొందించేలా చర్యలు చేపట్టామన్నారు. ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రమ్య

## యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



**పిడుగురాళ్ల:** పిడుగురాళ్ల పట్టణంలో యువకుడు మిస్ అయినట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు అయింది. తండ్రి రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... పిడుగురాళ్ల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఏరియాలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. కొక్కల్ల పూర్ణ అగస్త్య ఈ మధ్య కాలంలో చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటున్నట్లు తండ్రి రామాంజనేయులు పేర్కొన్నారు. అయితే సోమవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, బంధువులను, స్నేహితులను విచారించినా తెలియలేదని, పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పూర్ణ అగస్త్య ఇంటి నుంచి వెళ్లే సమయంలో రోజ్ కలర్ టీ షర్టు, బ్రౌన్ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు. యువకుడు కనిపించగానే 94407 96899, 80999 10446 నంబర్లకు ఫోన్ చేయాలని అన్నారు.

## క్రీడా రంగానికి శంకర నాగిరెడ్డి విశేష సేవలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలత

**సత్తెనపల్లి:** క్రీడా రంగానికి పీడి ఇనగంటి శంకరనాగిరెడ్డి విశేష సేవలు అందించారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలత అన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా సేవలందించిన ఇనగంటి శంకరనాగిరెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ చేయగా మంగళవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులను జాతీయ స్థాయి క్రీడాకారులుగా శంకరనాగిరెడ్డి తీర్చిదిద్దారని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయని కె.లతా ప్రియదర్శిని మాట్లాడుతూ క్రీడాకారులగానే కాకుండా.. క్రమ శిక్షణతో మెలిగేలా విద్యార్థులకు శిక్షణనిచ్చారన్నారు. శంకరనాగిరెడ్డి నాలుగు దశాబ్దాలుగా అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. శంకరనాగిరెడ్డి, భవాని దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కరీముల్లా రావు, ఉపాధ్యాయులు వీవీ హరనాథ్, లక్ష్మీ పతి, శ్రీనివాసరెడ్డి, చిన్నిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పీడీ శంకర నాగిరెడ్డి, భవానీ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఉపాధ్యాయులు

## ప్రతిభగల విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయం

ఎంఈఓ నరసింహారావు

**అచ్చంపేట:** ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు చేయూతనిస్తున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్ అభినందనీయమని ఎంఈఓ రావిపాటి నరశింహారావు అన్నారు. అచ్చంపేటకు చెందిన నందమూడి తరుణ్ అనే విద్యార్థి విజయవాడలోని ఎబీవర్స్ అకాడమీలో సీఏ చదువుతున్నాడు. హాస్టల్ ఫీజు నిమిత్తం విద్యార్థికి స్నేహహస్తాలు ఫౌండేషన్ రూ.30,000ల నగదు చెక్కును ఎంఈఓ చేతుల మీదుగా మంగళవారం అందజేసింది. గతేడాది కూడా హాస్టల్ ఫీజు తామే చెల్లించామని సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు తెలిపారు. విద్యార్థి సీఏ కోర్సు ముగిసే వరకు తమ వంతుగా సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు చెంచయ్య, శ్యామలరావు, కంప్యూటర్ ఆపరేటర్ కోవూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యార్థి తరుణ్‌కు నగదు చెక్కు అందజేస్తున్న ఎంఈఓ నరసింహారావు

## బడిఈడు పిల్లలంతా బడిలో ఉండాలి

**సత్తెనపల్లి:** బడి ఈడు కలిగిన పిల్లలంతా బడిలో ఉండాలని ప్రధానోపాధ్యాయుడు ఎస్. ఏడుకొండలు అన్నారు. పట్టణంలోని శాలివాహన నగర్‌లో ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులతో కలిసి 'నేను బడికి పోతా' ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు ఏడుకొండలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనంతో పాటు క్వాలిఫైడ్ టీచర్లతో విద్యాబోధన జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. బడి ఈడు కలిగిన పిల్లలను బడిలో చేర్పాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో నినాదాలు ఇస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు విద్యార్థులున్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ముప్పాళ్ళ:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడు పి.జయకృష్ణ సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ముప్పాళ్ళలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ మాట్లాడుతూ దోమల నివారణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారించవచ్చన్నారు. నివాస పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో దోమల నివారణపై చైతన్య పరిచాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమల తెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణి, ఆయా గ్రామాల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

## కొనసాగుతున్న విత్తన యజ్ఞం

**కారెంపూడి:** నల్లమల అటవీ ప్రాంతంలో విత్తన బంతులు చల్లే సేవా కార్యక్రమాన్ని కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) కొనసాగిస్తున్నారు. కారెంపూడి సమీపంలోని కాకిరాల రిజర్వ్ ఫారెస్టుకు చెందిన మైదాన ప్రాంతాలలో విత్తన బంతులను కొందరు సహచరులతో కలసి వెళ్లి చల్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూమి బాగా పదును కావడంతో పాటు తర్వాత కురిసే వర్షాలకు మొలుస్తాయనే సంకల్పంతో విత్తన బంతులను విరివిగా చల్లారు. విత్తనాలు మధ్యలో ఉంచి పాటి ఎరువుతో కలిపిన పాటి మట్టిని చుట్టూ ఉండలా చుట్టి వాటిని ఎండ బెట్టి తర్వాత వాటిని విత్తన బంతులుగా చల్లుతామని జాజి తెలిపారు. విత్తన బంతి భూమిపై పడిన తర్వాత దానికున్న మట్టి భూమిని తాకి.. వర్షం పడిన తర్వాత విత్తన బంతి నుంచి మొలక బయటకు వచ్చి మొక్కగా ఎదుగుతుందన్నారు. తన సంకల్పానికి మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు విత్తన బంతులు తయారు చేసి అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్న అందరికి జాజి అభినందనలు తెలిపారు. అయితే ఇది ఒక ఉద్యమంగా కొనసాగాలని ఎక్కడికక్కడ ఎవరికి వారు విత్తన బంతులు సమీపంలోని అటవీ మైదాన ప్రాంతాలలో చల్లడంతో పాటు మొక్కలు విరివిగా నాటి వాటిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణకు, వర్షాలు సమృద్ధిగా పడడం కోసం, సస్యశ్యామలైన పంటలు పండడం కోసం మన సమయాన్ని కొద్దిగా పర్యావరణ పరిరక్షణకు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. అది మన ప్రాథమిక విధి అని మరచిపోకూడదన్నారు.



నల్లమలలో విత్తన బంతులు చల్లుతున్న జాజి

## పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**మాచర్ల:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క (ఏక్ పేడ్ మా కే నాం పర్) కార్యక్రమం నిర్వహించారు. మాచర్ల పట్టణంలోని సాగర్ రోడ్‌లో నాగ బుద్ధుని శివాలయంలో బీజేపీ మాచర్ల పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్ తల్లితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఓర్సు పద్మావతి పట్టణ ప్రధాన కార్యదర్శి ఏచూరి సురేష్ యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు మారం వంశీకృష్ణ, టీడీపీ నాయకులు జమలయ్య, భవాని శంకర్, చల్ల హరిబాబు, జి.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

